



# మాధవ సేవ

**ప్రభాసుబ్బారావ్**

రాత్రి ఏడు గంటలయ్యింది. నేనూ, మా వారు ఏదో పిచ్చాపాటి మాట్లాడుకుంటూ గేటు దగ్గర కుర్చీల్లో కూర్చున్నాం. లూనా వచ్చి ఆగింది. లూనా వెనకాల కూర్చున్న మా పెద్దబ్బాయి రఘు గేటు తీసుకొని లోపలికి వస్తూ "నాన్నగారూ, బాలాజీ చెరువు దగ్గర టాక్సీ స్టాండ్‌కి వెళ్లాం. అన్నవరం డ్రాపింగ్ అయితే మూడు వందలట. అప్ అండ్ డౌన్ అయితే ఐదువందలట. ఏం చేద్దాం?"

"నాన్నగారూ, అప్ అండ్ డౌనే బెస్ట్ కదండీ" లూనా స్టాండ్ వేసి వచ్చిన చిన్నబ్బాయి వేణు అన్నాడు.

"తెల్లవారుఝాముున బయలుదేరి వెళ్లాలి కదా. వ్రతం చేసుకొంటాం కాబట్టి పదయిపోతుంది. అప్పటివరకూ వెయిట్ చేస్తానంటే అప్ అండ్ డౌనే బెటరు" మా వారు అన్నారు.

"కార్తీకమాసం కదా. కొంచెం రద్దీగానే ఉంటుంది. వ్రతం, దర్శనం పది గంటలకే అయిపోతుందని నమ్మకం పెట్టుకోకూడదు. టాక్సీ అబ్బాయితో ముందే ఖచ్చితంగా మాట్లాడండి. తిరిగి వచ్చేసరికి పన్నెండు అయిపోవచ్చుని చెబితే ముందు వచ్చినా ఫరవాలేదుగానీ లేటయితే ఎక్కువ గుంజడానికి ట్రై చేస్తారు" నా సలహా చెప్పాను.

"ఏమయినా అమ్మ బుర్రే బుర్ర" వేణు నా వెనకాల వచ్చి మెడ చుట్టూ చేతులు వేస్తూ అన్నాడు.

"అందుకే కదరా అమ్మకు 'హోం మినిస్టర్' పదవి ఇచ్చేశాం" మా వారు నవ్వుతూ చురక అంటించారు.

"ఏమిటి హోం మినిస్టర్ పదవి మీరిచ్చేది. ఈ పదవి నా అంతట నేనే నిర్మించుకొన్న అపురూపమైన పదవి" వాదించడానికి ముందుంటాను నేను.

"సరే సరే. ఒప్పేసుకున్నాం బాబూ. రఘూ మీరూ వెళ్లి టాక్సీ బుక్ చేసి షార్ప్‌గా నాలుగు గంటలకు రమ్మని, అమ్మ చెప్పిన కండిషన్స్ కూడా చెప్పండి."

"ఔనూ. మన యువరాణివారు కన్పించడం లేదేమిటి?" వేణు లోపలికి చూస్తూ అన్నాడు.

"ఏముంది. ఏ పుస్తకాల్లోనో తలదూర్చి నమిలి మింగేస్తూ ఉంటుంది" హాస్యంగా అన్నాడు రఘు.

మా అమ్మాయి స్నేహకు పుస్తకాల పిచ్చి ఎక్కువ. ఎంతంటే కిరాణా షాపు నుండి తెప్పించిన పొట్లం విప్పిన పేపరు కూడా వదలదు. అందుకే దానిని 'పుస్తకాల పురుగు', 'యువరాణి' అని ఏడిపిస్తారు వాళ్ల అన్నలిద్దరూ.

"అమ్మా. స్నేహా కొంచెం మంచినీళ్లు తీసుకురా తల్లీ" మా వారు కూతుర్ని అపురూపంగా పిలిచారు.

"ఆ.. వస్తున్నాను నాన్నగారూ" అంటూనే మంచినీళ్ల గ్లాసుతో ప్రత్యక్షమయ్యింది.

"హీరోలిద్దరి పెత్తనాలు అయిపోయాయా?" వేణు, రఘులను అడిగింది.

"ఇంకా అవ్వలేదు మేడమ్‌గారూ. బాలాజీ చెరువు దగ్గరకి వెళ్లాలి. ఏమన్నా ఆర్డర్లు సెలవిస్తారా?" వెటకారంగా అన్నాడు వేణు. అన్నలు బయటకు వెళ్తుంటే ఏదో ఓ పని పురమాయించడం అలవాటు స్నేహకు.

"ఇప్పుడు బాలాజీ చెరువు దగ్గరికి ఎందుకు అన్నయ్యా?"

"మనం రేపు అన్నవరం వెళ్తున్నాం తెలుసు కదా. టాక్సీ బుక్ చెయ్యడానికి మేడమ్. పెత్తనాలు చెయ్యడానికి కాదు" వేణు చెల్లిని వెక్కిరించాడు.

"చెల్లీ. నాలుగు గంటలకు బయలుదేరుతున్నాం. నువ్వు స్లోమోషన్‌లో రెడీ అవుతావు. ఈ రాత్రే రేపు వేసుకునే బట్టలు సెలెక్ట్ చేసుకొని అందరి కన్నా ముందు లేచి రెడీ అవ్వు." స్నేహ రెడీ అవ్వడానికి లేట్ చేస్తుందని ముందుగానే వార్నింగ్ ఇచ్చాడు రఘు.

"ఓ.. రేపు మార్నింగేనా వెళ్లేది."

"ఏ లోకంలో ఉంటావు మహాతల్లీ. ప్రొద్దుట నుండీ అమ్మ, నాన్నగారు చర్చల్లో ఉన్నారు కదా" వేణు ఆట పట్టించాడు.

"చెల్లి లేదుకదా నాన్నా. ప్రొద్దుటే పూజ వాళ్లమ్మగార్ని కేన్సర్ హాస్పిటల్‌లో టెస్ట్‌లని పూజకు తోడుగా వెళ్లి ఇంతక్రితమే వచ్చింది. ఇంకా నేనేమీ చెప్పలేదు" స్నేహను పెనవేసుకొచ్చాను. పూజ మంచి ఫ్రెండ్ స్నేహకు.

"రిపోర్ట్స్ వచ్చాయా? ఏమన్నారమ్మా?"

"వచ్చాయి నాన్నగారూ. యూట్రస్ క్యాన్సర్ అట. వీలయితే రేపే ఎడ్మిట్ అవ్వాలని చెప్పారు. పాపం పూజ ఒకటే ఏడుపు. మనీ ప్రాబ్లమ్ ఒకటి. మధ్యాహ్నం వాళ్ల నాన్నగారు మనీ గురించి అన్నీ తిరిగారట. మొత్తం ఐదువేలు కావాలట" దిగులుగా చెప్పింది స్నేహ.

"అయ్యో. వెంటనే ఎడ్మిట్ చెయ్యమన్నారా?"

"పోనీ నాన్నగారూ... మనం ఈ అన్నవరం ప్రయాణం కేన్సిల్ చేసుకొని ఈ పూజ కోసం మనం కొంత పక్కన పెట్టాం కదా. అది పూజ అమ్మగారి ఆపరేషన్‌కు సాయం చేద్దాం" ప్రతీ విషయానికి 'ఈజీ సొల్యూషన్స్' చెప్పే వేణు అన్నాడు.

"అయ్యో అలా అనకురా బాబూ. మూడు సంవత్సరాల ముందు మొక్కు. అందరికీ ఒకేసారి పరీక్షలు జరగకపోవడం, ఆర్థికపరమైన ఇబ్బందులు, ఏదో ఇప్పటికి మూడునెలల నుండి కొంచెం కొంచెం బడ్జెట్ ప్లానింగ్ చేస్తే, ఈ రెండు వేలు వెనుకబెట్టగలిగాం. ఎక్కడెక్కడి నుండో వచ్చే మొక్కులు తీర్చుకొని వెళ్తున్నారు. గంటన్నర ప్రయాణంలో ఉండి మనం వెళ్లలేకపోతున్నాం. ఏ ఆటంకం లేకుండా వెళ్లి మొక్కు తీర్చుకొని వద్దాం" వేణు మాటలు అపశకునంలా అన్పించి ఖండించాను.

"నువ్వే అంటావు కదా రమా. అవసరానికి ఆర్థిక సహాయం అందిస్తే అది వారి రూపంలో భగవంతునికి చేరుతుందని. వేణు చెప్పిన అయిడియా బాగుంది. పూజ వాళ్లమ్మగార్ని వెంటనే ఆపరేషన్‌కి మన వంతు సహాయం అందిద్దాం. అన్నవరం సత్యన్నారాయణమూర్తి వ్రతం ఇంకో ఆరునెలలు పోస్ట్

ఫోన్ చేద్దాం. మూడు సంవత్సరాల నుండి మన కోసం ఎదురుచూసినాయన ఇంకో ఆరునెలలు ఆగరా?" శ్రీవారి మాటలు పూర్తవ్వకుండానే స్నేహ "మా మంచి నాన్నగారు" అంటూ గట్టిగా ముద్దు పెట్టుకొంది.

"నిజమే నాన్నగారూ. అమ్మ ఎప్పుడూ ఆపదలో ఉన్నవాళ్లకు మనకున్న దానిలో సహాయం చెయ్యాలి" అనే గోల్డెన్ వర్డ్స్ మనస్సులో ముద్రపడిపోయి, వేణు అంత తొందరగా సొల్యూషన్ చెప్పేశాడు. "అమ్మా.. రేపు నీకు టేప్ చేసిన సత్యన్నారాయణ వ్రతం కేసెట్ తెస్తాను. ప్రొద్దుట ఇంట్లో సింపుల్‌గా పూజ చేసేసుకోవచ్చు. నాన్నగారు చెప్పినట్లు ఆరునెలల్లో మళ్లీ బడ్జెట్ ప్లాన్ చేసుకొని అందరం కలసి అన్నవరం వెళ్దాం" నేను ఎక్కడ నొచ్చుకొంటానో అని రఘుకి భయం.

అన్నవరం వెళ్లలేకపోయినందుకు ఏ మూలో కొంచెం బాధగా ఉన్నా నేను ఉపదేశించిన మార్గంలోనే ప్రయాణించే శ్రీవారిని, పిల్లల్ని చూసి ఒకింత గర్వంగా అన్పించింది. నిజమే జబ్బు ముదిరితే చెయ్యిదాటిపోతుంది.

"సరే అయితే. ఇంక టాక్సీ కోసం వెళ్లనక్కర్లేదు. రండి భోజనాలు చేసి పూజ ఇంటికి వెళ్లి వద్దాం" కుర్చీ లోంచి లేస్తూ అన్నాను. "మా మంచి అమ్మ" వెనకాల నుండి వచ్చి గట్టిగా పట్టుకొంది స్నేహ.

"అసలు అమ్మ టాక్సీకి ఒప్పుకొన్నప్పుడే అనుకొన్నాను. ఇటువంటి ఆటంకం ఏదో వస్తుందని" అల్లరిగా అన్నాడు వేణు.


"వెధవా. టాక్సీకి ఎందుకు ఒప్పుకొన్నానో తెల్సు కదా. నాన్నగారి కాలు నొప్పి వల్ల. లేకపోతే వంద రూపాయల చార్జీలతో వదిలిపోయే ప్రయాణానికి ఐదు వందలు ఖర్చు చెయ్యడమా!" వేణు చెవి మెలేశాను నవ్వుతూ.


"పోనీలే అమ్మా. అప్పటికి నాన్నగారి కాలి నొప్పి తగ్గిపోతుంది. కాబట్టి నీ బడ్జెట్ ప్రకారమే ప్యాసింజర్ బస్‌లో వెళ్దాం" రఘు నవ్వాడు.

అందరూ ఫక్కుమన్నారు.

భోజనాలయిన తరువాత రెండు వీధుల అవతల ఉన్న పూజ ఇంటికి బయలుదేరాం అందరం కలసి. మా వారికి కాలు నొప్పి అని రఘు మోపెడ్ మీద తీసుకువచ్చాడు.

మేం ముగ్గురం నడుచుకొంటూ వెళ్లాం.





పూజ అమ్మ, నాన్నగారు మేం వెళ్లేసరికి విచారంగా కూర్చుని ఉన్నారు. పూజ ఎదురొచ్చి "రండి ఆంటీ" లోపలకి తీసుకువెళ్లింది.

"మీరేమీ కంగారుపడకండి శారదగారూ. ఇప్పుడు ప్రతీ జబ్బుకి చక్కటి ట్రీట్‌మెంట్ ఉంది. పూజకు సాయంగా స్నేహ ఉంటుంది. మీ అమ్మగారు ఊరు నుండి వచ్చేంతవరకూ మిమ్మల్ని నేను చూసుకొంటాను" పూజ వాళ్లమ్మగారి పక్కన కూర్చుని చెయ్యి పట్టుకొని చెప్పాను.

"మీ దగ్గర ఉన్నప్పుడు ఇవ్వవచ్చు. ప్రస్తుతం ట్రీట్‌మెంట్‌కి ఉపయోగించండి. ఇందులో రెండు వేలున్నాయి" సహాయంగా అంటే పూజ నాన్నగారు ఫీలవుతారని "ఉన్నప్పుడివ్వవచ్చు" అంటూ ఆయన చేతిలో పెట్టారు.

"భగవంతుడే మీ రూపంలో ఇంటికి వచ్చినట్లుంది. ఈ సమస్యకి పరిష్కారం ఎలాగా? అని తల బద్దలుకొట్టుకునే టైంలో మీరిలా వచ్చి ఆదుకోవడం నిజంగా..." ఆయన నోట్లో మాట రాలేదు.

"భలేవారంకుల్. మా నాన్నగారిని భగవంతుడు అంటూ గుళ్లో కూర్చోబెడితే కొబ్బరిచెక్కలు ఏరుకొంటూ కూర్చోవాలి" రఘు మాటలకు అందరూ నవ్వారు. వాతావరణం తేలికయ్యింది. మరోసారి అందరికీ ధైర్యం చెప్పి తృప్తి నిండిన గుండెలతో ఇంటిమొహం పట్టాం.